




# కరపత్రం

SINCE 2014

సోమవారం ఆగస్ట్ 03, 2026 | సంపుటి : 2 | సంచిక : 292 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## ప్రధాని నిర్ణయంతో
# నా కుమార్తెకు పునర్జన్మ



- మోదీకి తల్లి కృతజ్ఞతలు
- కుమార్తెకు కొత్త జీవితం
- ప్రధానికి మరోసారి క్షమాపణ
- సు కొట్టివేయాలని విజ్ఞప్తి
- సోషల్ మీడియా బెదిరింపుల ఆందోళన
- మైనర్ల రక్షణకు చర్యల కోరింపు
- నిరసనల్లో ప్రభావితమయ్యానన్న బాలిక
- పుట్టినరోజున గొప్ప కానుకగా క్షమాభిక్ష వ్యాఖ్య

పేపర్‌లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనల్లో భాగంగా ప్రధాని మోదీ (PM Narendra Modi )పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు నోయిడా పోలీసులు ఓ బాలికపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఆమె తన తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాలిక తల్లి స్పందిస్తూ.. తన కుమార్తెను క్షమించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. “ప్రధాని క్షమించడంతో నా కుమార్తెకు కొత్త జీవితం లభించింది. అభ్యంతరకరమైన పదాలను ఉపయోగించినా.. క్షమించి ఆయన గొప్ప మనసును చాటుకున్నారు. ఇవాళ నా కుమార్తె పుట్టినరోజు. ఆమెకు ప్రధాని అత్యంత గొప్ప కానుకగా కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఈరోజు ఆమెకు పునర్జన్మ లభించింది” అని పేర్కొన్నారు.

మైనర్లను సోషల్ మీడియా వాడకుండా.. నిరసనల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని బాలిక తల్లి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు ఆమె వయసు 25ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ ఆమె వయసు 15 ఏళ్లే అని పేర్కొన్నారు. తన కుమార్తెపై నమోదు చేసిన కేసును కొట్టివేయించాలని ప్రధానిని కోరారు. తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పినప్పటికీ.. ఆమెకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయన్నారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా బాలిక మరోసారి ప్రధాని మోదీకి క్షమాపణలు తెలియజేసింది. నిరసనల్లో భాగంగా కొందరి ప్రభావానికి లోనైన తాను ప్రధానికి (PM Modi) వ్యతిరేకంగా చెడు మాటలు మాట్లాడానని పేర్కొంది.

## సికింద్రాబాద్ లష్కర్ బోనాల్లో ఆధ్యాత్మిక శోభ

- ఉజ్జయిని మహంకాళి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు
- బంగారు బోనం, పట్టువస్త్రాలతో అమ్మవారికి మొక్కులు
- రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు
- మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్న సీఎం



2 లో

సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఈ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారి దివ్య దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రజలందరి తరపున ఆయన జగన్మాతకు బంగారు బోనంతో పాటు పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**పూర్ణకుంభంతో స్వాగతం.. సమృద్ధిగా పాడిపంటలకై ప్రార్థనలు**

లష్కర్ బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అర్చకులు, అధికారులు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.



## జూరాల ప్రాజెక్టుకు భారీ వరద..
### 27 గేట్లు ఎత్తివేత

ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి లక్షా56వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా 27 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు అధికారులు. మరోవైపు ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లో 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు.

2 లో

## సీజేపీ భవిష్యత్ కార్యాచరణ..
### ఆగస్టు 5న కీలక సమావేశం

కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నివాసంలో (మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్) ఈ నెల 5న కోర్ కమిటీ సమావేశం జరగనుంది. వాలంటీర్లు, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి సమావేశానికి రావాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం




ఉంది. అనంతరం విలేకరుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి దీప్కే ఆదివారం వేడుకలు నిర్వహించారు

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో టెండర్‌ను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లు స్వీకరించనుంది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.



## అయ్యో పాప..
### ఏంటీ ఘోరం.. చెరువులో ముంచి.. 9నెలల చిన్నారిని చంపిన కన్నతల్లి

హైదరాబాద్ సిటీలోని ఎల్బీనగర్ పరిధి బైరామల్ గూడలో దారుణం జరిగింది. కన్న కూతురిని చెరువులో ముంచి హత్య చేసింది ఓ కసాయి తల్లి. అభంశుభం తెలియని చిన్నారిని నీటిలో ముంచి చంపడంతో స్థానికంగా ఈ ఘటన కలకలం రేపుతోంది. మద్యం మత్తులో చిన్నారిని హత్య చేసినట్లు స్థానికులు,పోలీసులు చెబుతున్నారు.

## చిట్టీల పేరుతో మోసం...
### రూ.5 కోట్లతో ఉడాయింపు!




**రాజేంద్రనగర్:** చిట్టీల పేరిట భారీ మోసం వెలుగు చూసింది. పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసిన కుటుంబం.. రాత్రికి రాత్రే పరారైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని బుద్వేల్‌లో చోటు చేసుకుంది. దాదాపు రూ.5 కోట్లతో దంపతులు పరారైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. శనివారం రాత్రే.. ఇంటికి తాళం వేసి కుటుంబంతో పరారైనట్లు చెబుతున్నారు. నిందితుడు అశోక్ ఇంటి వద్ద బాధితులు ఆందోళనకు దిగారు. వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ‘నాకు సొంత ఇల్లే లేదు’..
### భారీ మెజార్టీ ఇస్తేనే పోటీ చేస్తా



**నల్లగొండ:** తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గ ప్రజలు తనకు భారీ మెజార్టీతో గెలిపిస్తామని ముందస్తుగా హామీ ఇస్తేనే తాను పోటీకి దిగుతానని ఆయన స్పష్టం చేశారు.ప్రజల పూర్తి మద్దతు, నమ్మకం ఉంటేనే రాజకీయాల్లో కొనసాగుతానని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. తన రాజకీయ నిబద్ధతను,ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ.. తనకు నల్లగొండలో సొంత ఇల్లు గానీ, తన సొంత గ్రామంలో ఎలాంటి భూములు గానీ లేవని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. తాను స్వార్థం కోసం కాకుండా, కేవలం ప్రజల సేవ కోసమే రాజకీయాలు చేస్తున్నానని అన్నారు. నల్లగొండ పట్టణాభివృద్ధిపై తనకున్న లక్ష్యాన్ని చాటిచెప్పిన ఆయన, నల్లగొండను సాధారణ పట్టణంలా కాకుండా ఒక అత్యాధునిక నగరంగా, రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే నల్లగొండను కార్పొరేషన్‌గా మార్చామని, రహదారులు, మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి వివరించారు.

## ఇంజినీర్లను
### క్రిమినల్ వేస్ట్ అంటారా?..

- రాహుల్‌కు కేటీఆర్ లేఖ
- ఇంజినీర్ల అవమానంపై ఆగ్రహం
- రేవంత్ క్షమాపణ చెప్పాలి
- రాహుల్ స్పందించాలని డిమాండ్
- కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి
- విద్యార్థుల అవమానం సరికాదు
- రేవంత్ వ్యాఖ్యలపై విమర్శ
- ఇంజినీర్ల గౌరవం కాపాడాలి




**హైదరాబాద్:** ఇంజినీరింగ్ విద్యార్థులను సీఎం రేవంత్ రెడ్డి అవమానించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ విషయమై రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు, ఇంజినీర్లను “క్రిమినల్ వేస్ట్” అనడం ఏంటని దేశ అభివృద్ధికి కీలకంగా పనిచేస్తున్న ఇంజినీర్లను అవమానించడం సరికాదన్నారు. మిగతాద్ది 2 లో

## ఉత్సవాల నిర్వహణకు
### బిచ్చమెత్తుకోవాలా?


- బోనాల నిధులపై అసంతృప్తి
- రూ.20 కోట్లు సరిపోవని వ్యాఖ్య
- ఆలయాలకు తగిన నిధులు ఇవ్వాలి
- బీఆర్ఎస్‌పైనా విమర్శలు
- జనాభా ప్రాతిపదికన నిధుల డిమాండ్
- మహాకాళి అమ్మవారిని దర్శించిన బండి
- బోనాల ఏర్పాట్లపై ప్రశ్నలు
- ఉత్సవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



02

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ మహాకాళి అమ్మవారిని కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. బోనాల ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..
### నడిరోడ్డుపై బోల్తాపడ్డ బొలెరో వాహనం



**హైదరాబాద్:** కుత్బుల్లాపూర్ లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం రోడ్డు ప్రమాదానాకి కారణమైంది. రోడ్డు విస్తరణలో గుంతలు తీసి వదలడంతో బొలెరోర వాహనం నడిరోడ్డుపై బోల్తా పడింది.ఈ ప్రమాదంలో స్వల్పగాయాలతో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ పరిధిలోని బౌరంపేట్ కోకాకోలా కంపెనీ దగ్గర ఆదివారం (ఆగస్టు2) సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. మిని ఎక్స్ కావేటర్ లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం నడిరోడ్డుపూ గుంతలో పడి బోల్తా పడింది. అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. రోడ్డు విస్తరణలో భాగంగా గుంతలు తీసి వదిలివేయడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని కమ్యూటర్స్ డిమాండ్ చేస్తున్నారు.

## వచ్చే ఐదేళ్లలో డీజిల్, పెట్రోల్ వాహనాలు భారీగా తగ్గుతాయ్:
### ఆర్టీసీ ఎండీ



**హైదరాబాద్:** ప్రజారవాణా వ్యవస్థలో ఎలక్ట్రిక్ బస్సులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో కీటో మోటార్స్ ఈవీ బస్సును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆర్టీసీ 1,050 ఎలక్ట్రిక్ బస్సులు నడిపిస్తోందని, పీఎం ఈ డ్రైవ్ కింద 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. “ఇంటర్ సిటీ ఆపరేషన్స్‌లో 500 బస్సులు వినియోగిస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో డీజిల్, పెట్రోల్ వాహనాలు భారీగా తగ్గుతాయి. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కోసం ఆర్టీసీ ప్రణాళికలు రచిస్తోంది” అని నాగిరెడ్డి తెలిపారు.

# ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అంటారా?..

మొదటిపేజీ తరువాయి

ఈ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి చేత క్షమాపణ చెప్పించాల్సిన బాధ్యత రాహుల్ గాంధీదేనని కేటీఆర్ స్పష్టం చేశారు.కేటీఆర్ మాట్లాడుతూ.. "ఒకవేళ రాహుల్ మౌనం వహించడం అంటే రేవంత్ వ్యాఖ్యలను సమర్థించినట్లే విద్యార్థులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలోనూ విద్యార్థులపై రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ యువత కాంగ్రెస్ హామీల మోసాన్ని గుర్తుంచుకుంటుంది రేవంత్ వెంటనే విద్యార్థులు, గురువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# అయ్యో పాప.. ఏంటీ ఘోరం.. చెరువులో ముంచి.. 9నెలల చిన్నారిని చంపిన కన్నతల్లి

మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే..

ఎల్బీనగర్ పరిధిలోని బైరామల్ గూడలో నివాసముంటున్న ఇంజాపూర్ కు లోకసాని రాజేశ్వరి స్థానికంగా నివాసముంటోంది. ఆదివారం ( ఆగస్టు 2) సాయంత్రం కడుపున పెట్టిన బిడ్డ 9నెలల చిన్నారి అనురాధను పక్కనే ఉన్న చెరువులో ముంచి హత్య చేసింది. చిన్నారి హత్య స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు నిందితురాలిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఘటన సమయంలో నిందితురాలు రాజేశ్వరి మద్య మత్తులో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. పోస్ట్ మార్టమ్ కోసం చిన్నారి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# ఉత్సవాల నిర్వహణకు బిచ్చమెత్తుకోవాలా?

మొదటిపేజీ తరువాయి

ఉత్సవాల నిర్వహణ కోసం బిచ్చమెత్తుకోవాలా?అని ప్రశ్నించారు. జంటనగరాల్లో 3 వేలకు పైగా ఆలయాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతాయని, అందుకు రూ.20 కోట్లు సరిపోతాయా? అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం బోనాలకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన పండుగలు, ఉత్సవాలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# జూరాల ప్రాజెక్టుకు భారీ వరద.. 27 గేట్లు ఎత్తివేత

మొదటిపేజీ తరువాయి

జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516. మీటర్లుకాగా ప్రస్తుతం నీటిమట్టం 317.33 మీటర్లు గా ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 7.334 టీఎంసీలు గా ఉంది. ప్రాజెక్టునుంచి 27 గేట్లు ఎత్తి లక్షా 58వేల 702 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు అధికారులు.

ఇక ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి కొనసాగుతోంది. రెండు కేంద్రాల్లోని 11 యూనిట్లనుంచి డైలీ 434 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

# సికింద్రాబాద్ లష్కర్ బోనాల్లో ఆధ్యాత్మిక శోభ

మొదటిపేజీ తరువాయి

గర్భగుడిలోకి వెళ్లిన సీఎం, ఉజ్జయిని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని ఆయన తల్లిని ప్రార్థించారు.

**కలిసికట్టుగా ప్రజాప్రతినిధులు.. పటిష్ఠ బందోబస్తు**

ఈ ఆధ్యాత్మిక వేడుకలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఉత్సవాల నిర్వహణను పర్యవేక్షించారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు యంత్రాంగం ఆలయ పరిసర ప్రాంతాల్లో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసింది.

# త్వరలో నామినేటెడ్ పోస్టులు: తుమ్మల

తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు. వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని, సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్‌తో పిల్లలకు విముక్తి వెట్టి, బిక్షాటనల నుంచి 644మంది బాలలకు రక్షణ

సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగిసింది. జులై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోలీసులు.. మొత్తం 664 మంది చిన్నారులను రక్షించారు. వీరిలో 644 మంది బాలురు, 20 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ ముస్కాన్లో భాగంగా తెలంగాణకు చెందిన 162 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన 502 మంది చిన్నారులను గుర్తించారు. ఆపరేషన్‌లో భాగంగా సైబరాబాద్ పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమలు, కంపెనీలు, దుకాణాలు, హోటళ్లు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలను, ర్యాగ్ పికింగ్‌తో, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించారు. రక్షించిన చిన్నారుల వివరాలను దర్పణ్ యాప్‌లో పోలీసులు నమోదు చేశారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చే లక్ష్యంతో పోలీసులు ఆపరేషన్ ముస్కాన్ చేపట్టారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు

తీసుకున్నారు. చిన్నారుల భద్రతే లక్ష్యంగా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు.

# ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

## గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉత్తమ్ పర్యటన

**పూడికతీత పనులను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి**

తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులను సమీక్షించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, సుమారు 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు జీవనాడిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడాన్ని గుర్తించి, ప్రాజెక్ట్ పూడికతీతకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నుండి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిని రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల దెబ్బతిన్న ఈ మూడు ప్రాజెక్టుల పునరుద్ధరణ విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలను సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా ఏకీభవించిందని వివరించారు. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, అది ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగమని స్పష్టం చేసిన మంత్రి.. దాన్ని కూడా తామే కట్టినట్లు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యాములు 60 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది ఏళ్లకే ధ్వంసం అయ్యాయని ఎద్దేవా చేశారు. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాకుండా దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితులను కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు కూడా ఎగువ నుండి నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రతిభకు పదను పెడితే సాధ్యం కానిదేదీ లేదు

## కమ్యూనికేషన్ స్కిల్స్ ఎల్లవేళలా అవసరం

**- నిరంతర అధ్యయనం తోనే ఉన్నతశిఖరాలకు చేరుకుంటాం**

**- బాసర విద్యార్థులతో మాజీ డిజిపి మహేందర్ రెడ్డి**

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెడితే సాధించలేనిది ఏదీ లేదని రాష్ట్ర మాజీ డీజీపీ కె. మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్జీయూకేటీ విశ్వవిద్యాలయంలో పీయూసీ నూతన విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మహేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభకు సరైన దిశ చూపిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. జీవితంలో ఉన్నత విజయాలను సాధించాలంటే నిరంతర అధ్యయనం, కఠిన క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దృక్పథం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానానికే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భాషా ప్రావీణ్యం, సబ్జెక్టుపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి అంశంపై జిజ్ఞాస, విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని అలవర్చుకుంటే విజయాన్ని సులభంగా చేరుకోవచ్చని చెప్పారు. తన విద్యార్థి దశలో ఎదుర్కొన్న అనుభవాలు, కఠోర శ్రమ, పట్టుదల, నైతిక విలువలతో కూడిన జీవనశైలే తనను ఉన్నత స్థానానికి చేర్చాయని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రతి విద్యార్థి పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధన కోసం ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. వేగంగా మారుతున్న సాంకేతిక యుగంలో నూతన పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. డాక్టర్ మహేందర్ రెడ్డి వంటి విశిష్ట వ్యక్తుల అనుభవాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, డీన్లు, అధ్యాపకులు, పరిపాలనాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నల్ల చెరువుకు మహర్దశ

## హైడ్రా పునరుద్ధరణతో జలకళ

ఒకప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు నీటితో కళ తప్పిన ఉప్పల్ నల్లచెరువు ఇప్పుడు వర్షపు నీటితో కళకళలాడుతోంది. హైడ్రా చేపట్టిన సమగ్ర పునరుద్ధరణ పనుల ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు వరద నీటితో నిండిపోయి మళ్లీ జీవం పోసుకుంది.

హైడ్రా చేపట్టిన పునరుద్ధరణలో భాగంగా వరద నీరు చెరువులోకి చేరేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసింది. అదే సమయంలో మురుగు నీరు చెరువులోకి రాకుండా ప్రత్యేక బైపాస్ కాలువను నిర్మించింది. దీంతో భారీ వర్షాల సమయంలో వరద నీరు సురక్షితంగా చెరువులోకి చేరుతుండగా, ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వ, ముంపు సమస్యలు గణనీయంగా తగ్గాయి. పునరుద్ధరణలో భాగంగా 10 ఎకరాలకు పైగా ఆక్రమణలను తొలగించి, చెరువు విస్తీర్ణాన్ని దాదాపు 70 ఎకరాలకు పునరుద్ధరించారు. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. చెరువు జలవ్యవస్థను బలోపేతం చేసేందుకు నాచారం చెరువు, పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు చేరేలా రెండు ఇన్‌లెట్లను నిర్మించారు. అలాగే చెరువు పూర్తిగా నిండిన తర్వాత అదనపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా ఆధునిక ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేశారు. జల సంరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వాకింగ్ ట్రాక్, బలమైన ప్రధాన కట్ట, చిన్నారుల ఆట స్థలం, ఓపెన్ జిమ్, పచ్చదనంతో కూడిన వినోద ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు. కుటుంబాలతో వచ్చి విశ్రాంతి తీసుకునే నగరంలోని ప్రధాన వినోద కేంద్రంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిన హైడ్రా, ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలో హైదరాబాద్‌కు మరో కీలక జలవనరుగా, ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది.

# పెట్టుబుడులు లక్ష్యంగా సిఎం విదేశీ టూర్

## ఆగస్ట్ 20 నుంచి పది రోజుల పాటు వివిధ దేశాల్లో పర్యటన

తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగష్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటనకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో.. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

# వీసా బాండ్ కొనసాగించనున్న అమెరికా

## గరిష్ఠ బాండ్ పరిమితిని 20 వేల డాలర్లకు పెంపు

**- బాండ్ పరిధిలో భారత్ లేకపోవడంతో ఊరట**

గతంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వీసా బాండ్ విధానాన్ని కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. శాశ్వత ప్రాతిపదికన ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. గతంలో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో అమెరికా విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. విజిటర్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారు ముందుగా 15 వేల డాలర్ల వరకూ బాండ్ సమర్పించాలంటూ ఏడాది క్రితం అమెరికా ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. బీ-1 (బిజినెస్), బీ-2 (టూరిస్ట్) వీసాలకు దరఖాస్తు చేసుకునే వారు ఈ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఈ బాండ్ సమర్పించాలా? వాద్దా? అనేది కాన్సులార్ ఆఫీసర్లు నిర్ణయిస్తారు. వీసా గడువులోపు విదేశీయులు అమెరికాను వీడితే ఈ మొత్తాన్ని తిరిగిచ్చేస్తారు. లేకపోతే డబ్బును కోల్పోవాల్సి ఉంటుంది. అక్రమ వలసలను నిరోధించేందుకు అమెరికా ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా దరఖాస్తుదారులు 5 వేలు, 10 వేలు లేదా 15 వేల డాలర్ల బాండ్స్‌ను సమర్పించేవారు. ప్రస్తుతం అమలు చేయనున్న విధానంలో మాత్రం 5 వేల బాండ్ ఆప్షన్‌ను అమెరికా తొలగించింది. అంతేకాకుండా, గరిష్ఠ బాండ్ పరిమితిని 20 వేల డాలర్లకు పెంచింది. ఏడాది పాటు పైలట్ ప్రాజెక్టు ఫలితాలను పరిశీలించిన అనంతరం ఈ విధానాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. ఆగస్టు 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. మొత్తం 50 దేశాల వారికి ఈ బాండ్ విధానం వర్తిస్తుందని అమెరికా తెలిపింది. అయితే, ఈ జాబితాలో భారత్ లేకపోవడంతో ఇండియన్స్‌కు ఉపశమనం దక్కింది. అయితే, ఈ విధానాన్ని వలసదారుల హక్కుల కార్యకర్తలు, సంస్థలు మాత్రం విమర్శిస్తున్నాయి. బాండ్ భారంగా మారి అర్హులైన వారు అమెరికాకు దూరమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాయి.

# భూవివాదాల కేసులలో సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

# వ్యవస్థ వైఫల్యంతోనే భూవివాదాలు

**బోయిని సత్యనారాయణ,అడ్వకేట్**

భూములకు సంబంధించిన వివాద పరిష్కారాలలో వ్యూహాత్మక లేదా వ్యవస్థాగత వైఫల్యాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వివిధ సందర్భాలలో కీలక వ్యాఖ్యలు చేశారు.

అయితే, వీరు ప్రస్తావించిన 70 ఏళ్ల నాటి సుదీర్ఘ హరిద్వార్ భూవివాద కేసును ఇటీవల పరిష్కరించింది.

**జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పులో న్యాయస్థానం క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల తీరును తప్పుబట్టింది.**

- **70 ఏళ్ల నాటి సుదీర్ఘ హరిద్వార్ భూవివాద కేసు యొక్క అధికారిక సైటేషన్ నెంబర్ 2026 INSC 652 ...కన్సాలిడేషన్ అప్పీల్ / సివిల్ అప్పీల్ ఇది.**
- **హరిద్వార్ జిల్లా, నసీర్‌పూర్ కలాన్ గ్రామానికి చెందిన 15.5 బిగాల భూ వివాదం ఇది.**

కోర్టు వ్యాఖ్యలు...మ్యుటేషన్ కొరకు రెవెన్యూ రికార్డుల మార్పిడి ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారులు చేసిన తప్పులు, సాక్ష్యాలలో చిన్నచిన్న వ్యత్యాసాలను సాకుగా చూపి దశాబ్దాల నాటి రిజిస్టర్డ్ పత్రాలను తిరస్కరించడం వల్లనే 4 తరాల పాటు ఈ కేసు సాగిందని, ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనమని ధర్మాసనం తప్పుబట్టింది.

**జి. సామినాథన్ వర్సెస్ స్టేట్' మరియు అక్కిరాజు పాండురంగారావు**

కేసులో జస్టిస్ బి.వి. నాగరత్న మరియు జస్టిస్ ఉజ్జల్ భుయాన్ గారు భూవివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చడం మరియు సాంకేతిక కారణాలతో సివిల్ దరఖాస్తులను తిరస్కరించడం వంటి ఇతర వ్యవస్థాగత లోపాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**చిన్న వ్యత్యాసాలతో చట్టబద్ధమైన హక్కులను తిరస్కరించడం వ్యవస్థ వైఫల్యం**

రిజిస్టర్డ్ పత్రాల తిరస్కరణ...దశాబ్దాల క్రితం చట్టబద్ధంగా నమోదైన సేల్ డీడ్‌లను (అమ్మకపు పత్రాలను), సాక్ష్యాలలో లేదా రికార్డులలో ఉండే చిన్నచిన్న వ్యత్యాసాల ఆధారంగా కింది కోర్టులు లేదా రెవెన్యూ అధికారులు చెల్లవని కొట్టివేయడం తీవ్రమైన పొరపాటని జస్టిస్ భుయాన్ కోర్టు పేర్కొంది.

వ్యవస్థాగత ఆలస్యం... మ్యుటేషన్ (రికార్డుల మార్పిడి) వంటి సాధారణ ప్రక్రియలతో ప్రారంభమయ్యే వివాదాలు, వివిధ రెవెన్యూ సంస్థలు మరియు కోర్టుల చుట్టూ తిరుగుతూ తరాల తరబడి సాగడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

- **సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చడం**



చట్టాన్ని దుర్వినియోగం చేయడం... భూములు లేదా రియల్ ఎస్టేట్ ఒప్పందాల వైఫల్యాలకు సంబంధించిన పూర్తి సివిల్ స్వభావం గల వివాదాలలో, మోసం జప్తమ్ఙఅస్త్ర వంటి క్రిమినల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంపై జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఉన్న ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది.

న్యాయవ్యవస్థపై భారం... సివిల్ కోర్టుల ద్వారా పరిష్కారం కావాల్సిన భూతగాదాలను క్రిమినల్ కేసులుగా మార్చడం వల్ల దర్యాప్తు సంస్థల సమయం వృథా అవ్వడమే కాకుండా, న్యాయవ్యవస్థపై కేసుల భారం పెరుగుతుందని స్పష్టం చేశారు.

- **సవరణల పట్ల ఉదారత చూపకపోవడం**

సాంకేతిక కారణాలతో తిరస్కరణ...భూమి సరిహద్దుల వివరాలు లేదా పత్రాలలో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు..Amendments దాఖలు చేసే దరఖాస్తులను కింది కోర్టులు కఠినంగా తిరస్కరించకూడదని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తీర్పునిచ్చారు.

నిజమైన న్యాయం... కేవలం సాంకేతిక లోపాల ఆధారంగా కాకుండా, వివాదానికి గల అసలు కారణాన్ని తెలుసుకునేందుకు వీలుగా కోర్టులు ఉదార వైఖరిని..Liberal View అవలంబించాలని, అప్పుడే వ్యవస్థాగత ఆలస్యాన్ని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

**వివాద పరిష్కారాలలో కోర్టులు కేవలం సాంకేతిక లోపాలను..Technicalities పట్టుకుని కూర్చోకుండా, కేసుల సంఖ్య పెరగకుండా నివారించడానికి వాదనల సవరణల... Amendment of Pleadings దరఖాస్తులపై ఉదార వైఖరిని అవలంబించాలని స్పష్టం చేశారు.**

- **భూసేకరణ పరిహారం మరియు వ్యవస్థాగత ఆలస్యం**
- **నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) వర్సెస్ రైతులు**

రీకాల్ పిటిషన్ విచారణ లో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మరియు జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం.. భూమిని కోల్పోయిన రైతులకు పరిహారం అందించడంలో లేదా వడ్డీ చెల్లించడంలో ప్రభుత్వ సంస్థలు అంతర్గత పరిపాలనా కారణాలు లేదా ఆర్థిక భారాన్ని సాకుగా చూపి ఆలస్యం చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

**షరాఫత్ అలీ మరియు ఇతరులు వర్సెస్ ఉత్తరాఖండ్ స్టేట్ / కన్సాలిడేషన్ అథారిటీ ...హరిద్వార్ కేసులో**

జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మరియు జస్టిస్ ఎన్.వి. అంజారియా ల ధర్మాసనం
1957 నాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ పత్రాలను క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు చిన్న వ్యత్యాసాల సాకుతో తిరస్కరించడం వల్లనే, 4 తరాల పాటు ఈ వివాదం సాగిందని వారు వ్యవస్థాగత లోపాలను ఎత్తిచూపారు.

ఇలా దేశ అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనాలు పాలనా వ్యవస్థ లోని ఉదాసీనత గురించి న్యాయస్థానాల క్రియాశీలత గురించి వరుసగా వెలువరిస్తున్న తీర్పులు,అభిప్రాయాల గురించి న్యాయకోవిధులు, సామాజిక కార్యకర్తలు సీరియస్ గా ఆలోచిస్తున్నారు.

**కోర్ట్ కేసుల జాప్యం వల్ల న్యాయం అందని ద్రాక్ష పండు మాదిరిగా మారడం తో సామాన్యులు పడుతున్న వేదన తీరడానికి మొత్తం పాలనా వ్యవస్థ అభయం ఇవ్వాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు.**

## ఆగస్టు 7న హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల మహాధర్నా

- పెండింగ్ పీఆర్సీ, డీఏలు, హెల్త్ కార్డుల అమలుతో పాటు సమస్యల పరిష్కారమే ప్రధాన డిమాండ్
- భారీ సంఖ్యలో పెన్షనర్లు పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలి
- ఎస్‌జీపీఏటీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెలిశోజు రామమనోహర్







**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 2**


రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో "మహా ధర్నా" నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెలిశోజు రామమనోహర్ తెలిపారు. ఆదివారం వరంగల్‌లో జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన మహాధర్నా సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా కొత్త పీఆర్సీపై స్పష్టత లేదని, పెండింగ్ డీఏల విడుదలపై ఎలాంటి ప్రకటన లేకపోవడం, హెల్త్ కార్డుల అమలులో పురోగతి కనిపించకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోందని విమర్శించారు. పెన్షనర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య మాట్లాడుతూ.. ప్రతి యూనిట్ నుంచి అత్యధిక సంఖ్యలో పెన్షనర్లు మహాధర్నాకు హాజరయ్యేలా బాధ్యులు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అందరూ బాధ్యతగా పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రు సుధీర్‌బాబు మాట్లాడుతూ.. మూడు నెలలుగా హెల్త్ కార్డుల ప్రీమియం మినహాయిస్తున్నప్పటికీ ఇప్పటికీ సేవలు అందుబాటులోకి రాకపోవడం దురదృష్టకరమన్నారు. స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్ల సమస్యతో పాటు ఇతర పెండింగ్ అంశాలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య మాట్లాడుతూ.. రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను పూర్తిస్థాయిలో చెల్లించకుండా ప్రభుత్వం అవాస్తవ ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. పెన్షనర్లకు రావాల్సిన అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కె. కుమారస్వామి, కె. కృష్ణకుమార్, ఆర్. వెంకటాచలం, బేతి నరసింహస్వామి, గూడూరు శ్రీనివాసరావు, గుర్రం నరసింహరాములు, నామాని సత్యనారాయణ, కె. సుధాకర్, వేల్పుల రవీందర్, డాక్టర్ వెంకటనారాయణ, కె. కృష్ణమూర్తి, వలబోజు సోమేశ్వరరావు, కె. మధుసూదన్‌రావు, సీహెచ్. సారంగపాణి తదితర నాయకులతో పాటు సుమారు 60 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

## మిలాద్ షరీఫ్ ఏర్పాట్లపై మార్కజి మిలాద్ కమిటీ సమీక్ష

- రబీ-ఉల్-అవ్వల్ 11న వార్షిక కార్యక్రమం.. ప్రజలు భారీ ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి





**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 2**

హనుమకొండ కేంద్ర మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో హిజ్రీ 1448 రబీ-ఉల్-అవ్వల్ 11వ తేదీన నిర్వహించనున్న వార్షిక మిలాద్ షరీఫ్ కార్యక్రమ ఏర్పాట్లపై ఆదివారం రాయపురలోని మదరసా బరకతియాలో కీలక సమావేశం జరిగింది.కమిటీ అధ్యక్షుడు అల్హాజ్ ఖ్వాజా సిరాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు,పరిశీలన అంశాలపై సవివరంగా సమీక్షించారు.సమావేశం హాఫిజ్ ముహమ్మద్ తన్వీర్ అహ్మద్ నూరీ పవిత్ర ఖుర్ఆన్ పఠనం,నాత్-ఎ-రసూల్-ఎ-మఖ్బూల్ పఠనంతో ప్రారంభమైంది.అనంతరం హజ్రత్ మౌలానా ఖ్వాజా జాఫర్ అల్-అబిదీన్ రిజ్వీ మాట్లాడుతూ,మిలాద్ షరీఫ్ సమావేశాలు పవిత్ర ప్రవక్త హజ్రత్ మహమ్మద్ పట్ల ప్రేమ,భక్తి,అనుబంధాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో ధార్మిక చైతన్యం,సోదరభావం,మంచి నైతిక విలువలను బలోపేతం చేస్తాయని అన్నారు.ప్రవక్త బోధనలను ప్రతి ముస్లిం తన దైనందిన జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యుడు హాఫిజ్ ముహమ్మద్ అఫ్జల్ అలీ షా నక్ష్‌బందీ గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మిలాద్ షరీఫ్ కార్యక్రమాలపై నివేదికను సమర్పించారు.కార్యక్రమ విజయానికి సహకరిస్తున్న సభ్యులు,దాతలు,ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఏడాది ప్రధాన మిలాద్ జల్సాలో రాంపూర్‌కు చెందిన ఖతీబ్-ఎ- అహ్లే-ఎ-సున్నహ్ హజ్రత్ అల్లామా మౌలానా ముఫ్తీ ముహమ్మద్ గుల్ఫామ్ రజా,ఖతీబ్-ఎ-హింద్ హజ్రత్ అల్లామా మౌలానా ముహమ్మద్ ఉమర్ నూరానీతో పాటు హైదరాబాద్‌కు చెందిన దావత్-ఎ-ఇస్లామీ పండితుడు హజ్రత్ మౌలానా సయ్యద్ అబ్దుల్ రజాక్ షకీర్ నూరీ,వరంగల్‌కు చెందిన హజ్రత్ అల్లామా మౌలానా హజ్ ఖ్వాజా జాఫర్ అల్-అబిదీన్ ఖాద్రీ రిజ్వీ తదితర ప్రముఖ ఇస్లామిక్ పండితులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. మదరసా బరకతియాకు చెందిన ఎనిమిది మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రముఖ మషాయిఖ్‌ల చేతుల మీదుగా సత్కరించి, సర్టిఫికెట్లు,తలపాగాలు అందజేయనున్నట్లు ప్రకటించారు.అలాగే హనుమకొండ,వరంగల్ ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రసంగం,వ్యాసరచన,నాత్ పోటీలు నిర్వహించడంతో పాటు లంగర్-ఎ-ఆమ్,ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సభ్యులు పలు సూచనలు చేశారు.అనంతరం హజ్రత్ అల్లామా మౌలానా అల్-హజ్ ఖ్వాజా జాఫర్ అల్-అబిదీన్ రిజ్వీ ఖాద్రీ ప్రార్థనలతో సమావేశం ముగిసింది.వార్షిక మిలాద్ షరీఫ్ ఆధ్యాత్మిక సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని,కార్యక్రమ విజయానికి సహకరించాలని మార్కజీ మిలాద్ కమిటీ విజ్ఞప్తి చేసింది.ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా భక్తిశ్రద్ధలు, క్రమశిక్షణ, ప్రజాసేవా స్ఫూర్తితో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## రాజు రాథోడ్ కు ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అవార్డు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 2**

ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అవార్డు – 2026ను కాచిగూడ లోని ఎంఎస్ఎస్ లా కాలేజీలో లా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి రాజు రాథోడ్ అందుకున్నారు. హైదరాబాద్ లక్ష్మీ గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాజు రాథోడ్ కు ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ గురువులు డాక్టర్ వి.రవి మాస్టర్, తెలంగాణ షి టీమ్ టెక్నికల్ హెడ్ లక్ష్మీ, మద్ది కన్నన్ గౌడ్ మాస్టర్ లు అందజేశారు. ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ సంఘాల గ్రాండ్ మాస్టర్లు, సీనియర్ మాస్టర్లు, కోచ్ లు, ప్రముఖులు రాజు రాథోడ్ ను ఘనంగా సన్మానించి అభినందించారు. అలాగే ఇటీవల గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచినందుకు గుర్తింపుగా ఈ అత్యున్నత గౌరవాన్ని ప్రదానం చేశారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఈ అవార్డు రాజు రాథోడ్ నిరంతర కృషికి, అంకితభావానికి, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఉన్న నిబద్ధతకు లభించిన మరో అరుదైన గౌరవంగా నిలిచింది.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు..

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 2**

చిల్పూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50మంది యువకులు, ముదిరాజ్ కులస్తులు, బిఆర్ఎస్ కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మకొండ కనకదుర్గ కాలనిలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జక్కుల వీరయ్య, చొక్కం సంపత్, చొక్కం రమేష్, రాజు, నాగరాజు, అజయ్, లింగనబోయిన రమేష్, ఇట్టబోయిన రాజశేఖర్, రాయగిరి సత్యం, పెద్ద వీరయ్య, మోతే రాహుల్, రంజిత్ తో పాటు మరో 30మంది ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షతులు అవుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని అనడానికి కాంగ్రెస్ పార్టీలోకి జరుగుతున్న చేరికలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, మాజీ ఎంపిపి బాలరాజు, కొండాపూర్ గ్రామ ఉప సర్పంచ్ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మందోటి మహేందర్ పటేల్ నియామకం

- ఓబీసీ వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తానని మహేందర్ పటేల్ వెల్లడి
- రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన నూతన జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ పటేల్

**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 2**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గోపాల్‌పూర్ మండలానికి చెందిన మందోటి మహేందర్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి ఆనంద్ గౌడ్ ఆదేశాల మేరకు, వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కూచన క్రాంతికుమార్ అధికారిక నియామక పత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేందర్ పటేల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పార్టీ జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతలను గౌరవంగా స్వీకరిస్తూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఓబీసీ వర్గాల సంక్షేమం, సాధికారత కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఓబీసీ వర్గాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకత్వం, జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతికుమార్, ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా నాయకత్వం, మండల నాయకులు, కార్యకర్తలు, తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ మహేందర్ పటేల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవే లక్ష్యంగా మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ పటేల్ తెలిపారు.

## ఉద్యమ సహచరుడిని కోల్పోయా పెద్ది మృతికి హరీష్ సంతాపసం

ఉద్యమ సహచరుడు, సోదరుడు, మంచి మనసున్న మనిషి పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మృత్యువును జయించి తిరిగి వస్తారనే ఆశతో మనమంతా ఎదురుచూశాం. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్తను జీర్ణించుకోవడం ఎంతో కష్టంగా ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని జీవితాంతం నిలబెట్టిన పోరాట యోధుడిగా, ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన సోదరుడిగా పెద్ది సుదర్శన్ అన్న ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతారని హరీశ్‌రావు అన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా నాకు ఒక ఉద్యమ సహచరుడిని, ఆత్మీయ సోదరుడిని కోల్పోయిన బాధ ఇది అని అన్నారు. పెద్ది సుదర్శన్ అన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ? వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని హరీశ్‌రావు తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు

# గురుకుల పాఠశాల రోడ్డుపై బురదతో విద్యార్థులు, ప్రజలు అవస్థలు



వెంటనే శాశ్వత పరిష్కారం చేయాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఆగస్టు 2:**
హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట పట్టణంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై నూతన పైప్‌లైన్ పనుల అనంతరం రోడ్డు పునర్నిర్మాణాన్ని అధికారులు సక్రమంగా చేపట్టకపోవడంతో తీవ్ర సమస్యలు నెలకొన్నాయని తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రహదారిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రస్తుతం మొత్తం రోడ్డు బురదమయంగా మారిందని తెలిపారు. దీంతో ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, స్థానిక ప్రజలు, వ్యాపారులు, అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజా రవాణా వాహనాలు కూడా రహదారిపై సజావుగా ప్రయాణించలేకపోతుండగా, ద్విచక్ర వాహనాలు బురదలో దిగబడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్య కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని, విద్యార్థుల భద్రత దృష్ట్యా జమ్మికుంట మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రహదారిని శాశ్వతంగా మరమ్మతు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పొన్నం శిరీష, దీటి రమేష్, అంబాల హరీష్, జంపాల రితేష్, గుండారపు కిరణ్, బండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్ జన్మదిన వేడుకలు




**కరపత్రం ప్రతినిధి వీణవంక, ఆగస్టు 2:**
వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎండీ సాహెబ్ హుస్సేన్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు గంగాడి తిరుపతి రెడ్డి, సర్పంచ్ అందె శ్రీమతి--కుమార్, మాజీ సర్పంచ్ పంజాల సతీష్, జిల్లా కార్యదర్శి కంకణాల జగదీశ్వర్ రెడ్డి, ధర్మకర్త జున్నుతుల మధుకర్ రెడ్డి, రాచపల్లి సంపత్, గుంటి రవీందర్, రాజ్ కొమురయ్య, కదర్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# భారత యోగా సమాఖ్య సభ్యునిగా మనోజ్ ఎంపిక

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్.**



భారత్ యోగా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ ఉప కమిటీలు నియామకం చేయగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుండి తెడ్డు మనోజ్ కుమార్ ని జాతీయ యోగా సమైక్య వివాద పరిష్కారాల ఉప కమిటీ సభ్యునిగా ఎంపికైనట్లుగా కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి ,గుంటి రామకృష్ణ లు తెలిపారు. మనోజ్ కుమార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కోరుట్ల ప్రాంతం నుండి కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వివిధ పోటీలలో పాల్గొని ఏసియన్ , అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. మనోజ్ ప్రస్తుతం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గా పనిచేయుచున్నట్టు తెలిపారు . భారత యోగ సమైక్య కీలకమైన సందర్భంలో మనోజ్ కుమార్ ను వివాద పరిష్కారాల ఉప కమిటీ సభ్యునిగా నియామకం చేయడం పట్ల జిల్లాకు ఎంతో గర్వకారణమని తెలిపారు .వీరి ఎంపిక పట్ల తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ,అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి ,భారత యోగ సమాఖ్య ఉపాధ్యక్షులు జే మనోహర్ కుమార్ ,వివిధ జిల్లాల అధ్యక్ష ,కార్యదర్శులు ఐశ్వర్య, ప్రభాకర్ రెడ్డి, కన్న కృష్ణ , కమలాకర్, బాలరాజు, సిహెచ్ గంగాధర్, కె విజయ్ కుమార్, పి .శ్రీనివాస్, మతిన్ , కే రవీందర్, యు రవీందర్, రాజు, నాగార్జున, పి స్వరూప చారి కోచులు వి కిష్టయ్య, పి మల్లేశ్వరి, కుమారస్వామి, రజిత, రాజశేఖర్ పవన్ అనిల్ రాజశేఖర్, కృష్ణ, కమలవాని తదితరులు అభినందనలు తెలిపారు

# 24వ డివిజన్‌లో రూ.50 లక్షల యుఐడిఎఫ్ నిధులతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 24వ డివిజన్‌లోని గుండు హనుమాన్ టెంపుల్ సమీపంలో రూ.50 లక్షల యుఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు , సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు గౌరవ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ , నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. నగర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు , స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి , జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి , కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేసినా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి







జీవితకాలం ప్రజాసేవ చేస్తా నిరుపేదలకు అండగా నిలుస్తా
ప్రజల ఆదారణతో అందరికీ ఆపద్బాంధవుడుగా బంధువుగా అండగా ఉంటా
మానవసేవే మాధవగా ఏకీభవ భావిస్తూ అందరికీ అండగా ఉంటా ఆవుల రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఆగస్టు 2**
రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గత నెలలో మాసాయిపేట మండల ప్రజల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల (ఐ క్యాంపు) కార్యక్రమానికి విశేష స్పందన లభించిందిని నర్సాపూర్ నియోజకవర్గ. కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజు రెడ్డి అన్నారు ఆదివారం నాడు మాసాయిపేట మండల కేంద్రంలోని రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేసిన వారు తెలిపారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐక్యాంపులో నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అవసరమైన లబ్ధిదారులను గుర్తించారు. అనంతరం వారికి ప్రత్యేకంగా కంటి అద్దాలను తయారు చేయించి, ఆదివారం నాడు మాసాయిపేట మండల కేంద్రంలో ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందని.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి తెలియజేశారు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాజన్న ఫౌండేషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అవసరమైన వైద్య సేవలు పొందలేని ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సమ సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

జిల్లా ఇంచార్జి ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ
ఎల్కతుర్తి ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ అడ్డూరి అనిల్ మాదిగ

**కరపత్రం ప్రతినిధి–ఎల్కతుర్తి:**
మత దురహంకారం, కుల వివక్షత, సామాజిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రధాన లక్ష్యమని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇంచార్జి ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ అన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి గ్రామ స్థాయి నుంచి బలమైన ప్రజా పోరాటాలను నిర్మించడంతో పాటు మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల ఇంచార్జి అడ్డూరి అనిల్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ విభాగాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఇంచార్జి ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ, జిల్లా కో-ఇంచార్జి తడుగుల విజయ్ మాదిగ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలుగా సాగిన రాజీలేని ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. మాదిగలతో పాటు పేద, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాలు సామాజిక న్యాయ సాధనలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. దేశంలో ఇప్పటికీ కొనసాగుతున్న కుల వివక్ష కారణంగా అణగారిన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయని పేర్కొంటూ, ప్రజల్లో రాజకీయ చైతన్యం పెంపొందించి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలని సూచించారు. అలాగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ విభాగాల కమిటీలను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పునర్వ్యవస్థీకరించి సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేసి క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని, మహనీయుల ఆశయాల సాధన, పీడిత వర్గాల విముక్తి, సామాజిక న్యాయం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సూచించిన ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో నూతన కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేసి ఉద్యమాన్ని మరింత విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు బొంకూరి వంశీ మాదిగ, ఎల్తూరి సురేష్ మాదిగ, బొంకురి కార్తీక్ మాదిగ, మేకల రవీందర్ మాదిగ, అంబాల సంపత్ మాదిగ, మారుపాక రవీందర్ మాదిగ, అడ్డూరి నవీన్ మాదిగ, అడ్డూరి ప్రశాంత్ మాదిగ, గ్రామ శాఖ అధ్యక్షులు అడ్డూరి శ్రీకాంత్ మాదిగ, గంగారపు రాజ్ మాదిగ, ఆరెపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎర్రోళ్ల అనిల్ మాదిగ, రాజ్ కొమురయ్య మాదిగ, శనిగరపు వంశీ మాదిగతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల ఇంచార్జి అడ్డూరి అనిల్ మాదిగ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# నరసరావుపేటలో ప్రత్యేక రైస్ కౌంటర్ ప్రారంభం

ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం విక్రయాలు
రైస్ కౌంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అరవింద బాబు



**కరపత్రం ప్రతినిధి నరసరావుపేట, ఆగస్టు 2:**
బియ్యం ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు ఊరట కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో ప్రత్యేక రైస్ కౌంటర్లను ప్రారంభించింది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని ఆవుల సత్రం రైతు బజార్లో ప్రత్యేక రైస్ కౌంటర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లలో సుమారు 500 ప్రత్యేక రైస్ కౌంటర్ల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని ఆగస్టు 1 నుంచి విక్రయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 500 రైస్ మిల్లులు సహకరిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారంబీపీటీ, కేఎన్ఎం, సూపర్ ఫైన్ రైస్ -- కిలో రూ.52లు, గ్రేడ్-1 రా రైస్ -- కిలో రూ.50లు నిర్ణయించారు. ఈ ధరలు మార్కెట్ ధరలతో పోలిస్తే కిలోకు సుమారు రూ.10 వరకు తక్కువగా ఉండటంతో వినియోగదారులకు గణనీయమైన ఉపశమనం లభించనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మధ్యతరగతి, పేద కుటుంబాలపై ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఎం వి. ప్రసాద్, రైతు బజార్ నిర్వాహకులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు ఊర భాస్కరరావు, ప్రజాప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

